సాక్షి తిరుపతి

బుధవారం ◆ 10 ◆ జనవరి ◆ 2024



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు. - 8లో



దాడి చేసి విషప్రచారమా?

టీడీపీ నాయకులు దాడి చేసి విషప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. - 8లో



ఎస్వీయూ సిగలో మణిహారం

ఎస్వీయూ సిగలో మరో మణిహారం చేరింది. వర్సిటీకి నైలెట్ సంస్థను మంజూరు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. - 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ పరిశోధన స్థానంగా ఆర్‌ఏఆర్‌ఎస్



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఆర్‌ఏఆర్‌ఎస్ సంచాలకులు రమణ, శాస్త్రవేత్తలు

తిరుపతి సిటీ: రాష్ట్రంలో వ్యవసాయ ఉత్తమ పరిశోధన స్థానంగా తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం ఎంపికైంది. మంగళవారం గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 53వ పరిశోధన సలహా మండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత మూడేళ్లుగా ఆర్ఏఆర్ఏ తిరుపతికి ఈ అవార్డు వరిస్తూనే ఉంది. ఈ సందర్భంగా ఆర్ఎఆర్ఎస్ సంచాలకులు రమణ మాట్లాడుతూ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు సిబ్బంది కృషి అమోఘమని తెలిపారు.

ఆలస్యంగా మామిడి పూత



మామిడితోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి, శాస్త్రవేత్త నాగరాజు

చంద్రగిరి: మండల పరిధిలోని ఐతేపల్లిలో మామిడితోటలను జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరథరామిరెడ్డి, చీని, నిమ్మ పరిశోధన శాస్త్రవేత్త నాగరాజు పరిశీలించారు. రాత్రి, పగటి ఉష్ణోగ్రతల వ్యత్యాసం వల్లఈసారి మామిడి పూత ఆలస్యంగా వస్తోందని తెలిపారు. హార్మోన్లు వాడిన తోటల్లో ముందుగానే పూత వస్తున్నట్లు గమనించామని చెప్పారు. నవంబరు, డిసెంబరు నెలల్లో మామిడికి ఎరువులు, నీరు వేయకుండా బెట్ట పరిస్థితులు కల్పించాలని రైతులకు సూచించారు. ఎ.జి.పల్లిలో రైతు సహకార సంఘం ద్వారా నిర్మిస్తున్న మామిడి సేకరణ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చంద్రగిరి మండల ఉద్యానవన అధికారిణి ఎస్.శైలజ, ఐతేపల్లి, నడింపల్లి ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ హెల్పర్



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్ సంధ్య

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట అంగన్‌వాడీ హెల్పర్ సంధ్య మంగళవారం విధుల్లో చేరారు. ఆమె మాట్లాడుతూ తోటి అంగన్‌వాడీ కార్యకర్తల ప్రోద్బలంతోనే బంద్‌కు సహకరించాల్సి వచ్చిందన్నారు. తనకు జాబ్ రావడానికి కారణం సీఎం జగనన్నే అని, జీతభత్యాలతో సంబంధం లేకుండా జగనన్న కోసం సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విధులకు హాజరవుతున్నట్ల రాతపూర్వకంగా పంచాయతీ కార్యదర్శి, ఐసీడీసీ సూపర్‌వైజర్‌కు వినతి పత్రం అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండింది. సోమవారం అర్ధరాత్రి వరకు 61,511 మంది స్వామివారిని దర్శించుకోగా 20,777 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సేవా లోపంపై ఏఈల జీతాలు కోత

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు సక్రమంగా సేవలందించని ట్రాన్స్‌కో ఏఈలపై ఏపీఈఆర్సీ చర్యలు చేపట్టింది. సేవాలోపం కింద ఏఈల వేతనాల్లో కోత విధిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఏప్రిల్ 23 నుంచి మూడునెలల పాటు వినియోగదారులకు సక్రమంగా సేవలందించకపోవడంతో ఈ నిర్ణయి తీసుకుంటున్న పేర్కొంది. డిస్కం అధికారుల నివేదిక మేరకు ఉమ్మడి జిల్లాలోని ఏఈల జీతాల నుంచి రూ.94,750 కట్ చేయాలని ఆదేశించింది.

పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు



ఆత్మీయత పంచి..ఆనందం పెంచి!

పింఛన్ల పెంపు సరికొత్త అధ్యాయం

- హామీ ప్రకారం రూ.3 వేల పింఛన్
- ఎన్నికల సమయంలో ఎవ్వరూ మాయమాటలు నమ్మొద్దు
- పింఛన్ల పంపిణీలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: దేశ రాజకీయ చరిత్రలో ఏ రాష్ట్రంలో అందించని విధంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు రూ.3.35 లక్షల కోటన్లు సంక్షేమ పథకాల ద్వారా అందించిన ఘనత సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. జగనన్న అందించిన రూ.3 వేల పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని తిరుపతి చెన్నారెడ్డి కాలనీ వద్ద మంగళవారం పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన పెన్షన్‌దారులకు రూ.3 వేలు పెన్షన్‌ను ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో టీటీడీ చైర్మన్ భూమన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలోనే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. 14 ఏళ్లపాటు అధికారంలో ఉన్న చంద్రబాబు చిన్నపాటి సంక్షేమ పథకాలను కూడా అందించిన పాపానపోలేదని మండిపడ్డారు. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.3 వేలు చేసిన ఘనత సీఎం జగనన్నదేనని కొనియాడారు. చంద్రబాబు పాలనలో పెన్షన్ తీసుకోవాలంటే వారాల కొద్దీ ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదన్నారు. జగనన్న అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పెన్షన్ 1వ తేదీనే ఇంటికి వచ్చి వలంటీర్లు అందిస్తున్నారని గుర్తుచేశారు. మాయమాటలు చెప్పే చంద్రబాబు, పవన్‌కళ్యాన్ వంటి అబద్ధాల కోరులకు ఓట్లు వేస్తే మీరు ఓడిపోవడం ఖాయమని హెచ్చరించారు.



పింఛన్ లబ్ధిదారులతో టీటీడీ చైర్మన్ భూమన, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్‌రెడ్డి

పట్టుదలకు మారుపేరు సీఎం జగన్



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సూళ్లూరుపేట: పట్టుదలకు, కార్యదక్షతకు ఐకాన్‌గా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని, ప్రజాసంకల్పయాత్ర చేసి ముఖ్యమంత్రి అయిన విషయమే ఆయన కార్యదక్షతకు నిలువెత్తు నిదర్శనమని సూళ్లూరుపేట వైఎస్సార్ సీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్ తెలిపారు. ప్రజాసంకల్పయాత్రకు ముగింపు పలికి ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు మంగళవారం బస్టాండ్ సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగనన్న ప్రజాసంకల్పయాత్ర చేపట్టి నిరుపేద దేవుడయ్యారని కొనియాడారు. మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరు పద్మ మిల్టన్, చిన్ని సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెట్టి వేణుయాదవ్, కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్ అయితా శ్రీధర్, తడ మండల పార్టీ అధ్యక్షులు కే.అర్ముగం, కార్యదర్శి వాకాటి బాబురెడ్డి, చెంగాళమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు కర్లపూడి సురేష్‌బాబు, వంకా దినేష్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ చీఫ్ పీఆర్వోగా తలారి రవి

తిరుపతి మంగళం/ తిరుపతి అలిపిరి: టీటీడీ పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తలారి రవికి చీఫ్ పీఆర్వోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు అధికారుల నుంచి చీఫ్ పీఆర్వోగా ఉత్తర్వులు అందుకున్నారు. చీఫ్ పీఆర్వోగా పదోన్నతి పొందిన రవిని పలువురు టీటీడీ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన చీఫ్ పీఆర్వో

టీటీడీ చీఫ్ పీఆర్వోగా పదోన్నతి పొందిన తలారి రవి మంగళవారం పద్మావతిపురంలో టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. 15 ఏళ్ల క్రితం తమ హయాంలోనే పీఆర్‌వోగా బాధ్యతలు చేపట్టానని తలారి రవి గుర్తుచేశారు. మళ్లీ టీటీడీ చైర్మన్‌గా కరుణాకరరెడ్డి ఉన్న సమయంలోనే టీటీడీ చీఫ్ పీఆర్‌వోగా పదోన్నతి లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తలారి రవిని టీటీడీ చైర్మన్ సత్కరించి అభినందనలు తెలిపారు.



టీటీడీ చైర్మన్ భూమనకు కృతజ్ఞతలు తెలుపుతున్న టీటీడీ చీఫ్ పీఆర్వో తలారి రవి

మగ్గానికి సంక్షేమ రంగులు





చేనేత మగ్గంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

నేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండ

- ఏటా నేతన్ననేస్తం పేరుతో రూ.24 వేలు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న కుటుంబాలు
- కొత్తపుంతలు తొక్కుతున్న చేనేత వస్త్రాలు
- సీఎం జగనన్న రుణం తీర్చుకుంటామంటున్న నేతన్నలు

జిల్లా సమాచారం

నేత కార్మికులు	15,475
సొంత మగ్గాలు ఉన్న వారు	4,250
చేనేత సొసైటీలు	42
చేనేత వృద్ధాప్య పింఛన్‌దారులు	5,771

సైదాపురం: మోడుబారిన మగ్గం బతుకులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ రంగులు అద్దుతోంది. చేనేత పరిశ్రమ అభివృద్ధికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి విశేషంగా కృషిచేస్తోంది. టీడీపీ హయాంలో మరమగ్గాలతో పోటీ పడలేక వెంకటగిరి నియోజకవర్గంలో చేనేత పరిశ్రమ చతికిలపడింది. బ్యాంక్‌ల నుంచి సహకారమూ లోపించింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత పరిశ్రమకు సరికొత్త ఊపిరినిస్తోంది.



అచ్చు అతుకుతున్న మహిళ



కండెలు చుడుతున్న నేత కార్మికురాలు

ఆర్థికంగా చితికిపోయిన చేనేత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ప్రతిఒక్క చేనేత కుటుంబానికి నెలకు రూ.2వేలు చొప్పున ఏడాదికి రూ.24 వేలు బ్యాంక్ ఖాతాల్లో జమవుతోంది. వరుసగా ఐదు విడతలుగా నేతన్న నేస్తం పేరుతో ప్రభుత్వం వారి ఖాతాల్లోకే నేరుగా నగదు జమచేస్తోంది. ఇప్పటి వరకు ఒక్కో కార్మికుడికి ఏడాదికి రూ.24 వేలు చొప్పున ఐదు విడతల్లో మొత్తం రూ.1.2 లక్షలు సమకూర్చింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆ మాటే శాసనం

ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలం, కలిచేడు గ్రామంలో జరిగిన చేనేత సదస్సుకు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో నేతన్నలు పాల్గొని తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అంతే.. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. నేతన్న నేస్తం పేరుతో వారి జీవితాల్లో బంగారు బాటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయంతో ముడిసరకులు కొనుగోలు చేసుకోవడమే కాకుండా మగ్గాన్ని ఆధునిక పద్ధతులతో తయారు చేసుకోవడ, సొంతంగా వ్యాపారాలు చేసుకోవడం, ఆధునిక డిజైన్లతో చీరలు నేయడం వంటి పనులు చేసుకుంటున్నట్టు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపుంతలు తొక్కుతున్న చేనేత

- చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఒకవైపు వైఎస్సార్ నేతన్న నేస్తం తోడ్పాటు ఇస్తుండగా.. మరో వైపు జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద క్లస్టర్లుగా ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేస్తున్నారు.
- నూలు కొనుగోలు నుంచి తయారైన వస్త్రాలకు మార్కెటింగ్ చేసే వరకు ప్రభుత్వం అన్ని దశల్లోనూ సహకారం అందిస్తోంది.
- 50 ఏళ్లు దాటిన ప్రతి నేతన్నకూ పెన్షన్ సదుపాయం కల్పిస్తోంది.
- వృత్తి నైపుణ్యాలు మెరుగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా క్లస్టర్లు ఏర్పాటు చేసి వెరైటీ డిజైన్లు, ఆధునాతన చీరలు నేసేందుకు అవసరమైన డిజైన్ కార్డులు, జూకార్డ్ 240 హుక్స్ మోటరైజ్డ్‌లిఫ్టింగ్ డైస్, ఐరన్ ఫ్రేమ్‌లూమ్స్‌లాంటి మిషన్లు, మోటార్లు తదితర పరికరాలను 80 శాతం సబ్సిడీపై అందజేస్తున్నాయి.
- అధునాతన వస్త్రాలను నేసేందుకు చేనేత కార్మికులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.
- ఆప్కో ద్వారా వస్త్రాల కొనుగోలు.
- రూ.25,000 సబ్సిడీ కలిగిన రుణాల మంజూరు
- 2022-23లో తిరుపతి జిల్లాలో 255 మంది చేనేత కార్మికులకు రూ.1.76 కోట్ల రుణాలు మంజూరు చేయగా, 2023-24లో వందలాది మందికి రుణాలు అందజేత.
- వెంకటగిరిలోని భావానారుషి చేనేత క్లస్టర్‌లో 895 మంది చేనేతలకు రూ.1.63 కోట్లు మంజూరు.
- ఎస్‌హెచ్‌డీసీ ద్వారా సబ్సిడీపై సిల్కు, నూలు సరఫరా
- రోజువారీ వ్యాపార అవసరాల కోసం మహిళా సంఘాలు, బ్యాంకుల ద్వారా రుణాలు
- కరోనా కష్టకాలంలో కూడా నేతన్నలకు ఇచ్చిన హామీ ప్రకారం సాయం



నేతన్న నేస్తం నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు రూ.కోట్లలో
2019-20	3,822	9.17
2020-21	3,572	8.81
2021-22	3,125	7.50
2022-23	3,171	7.51
2023-24	3,447	8.28

వెంకటగిరి నియోజకవర్గంలో నేతన్న నేస్తం వివరాలు

మండలం	లబ్ధిదారులు	నిధులు
వెంకటగిరి పట్టణం	1,676	రూ.21కోట్లు
వెంకటగిరి రూరల్	94	రూ.1.12 కోట్లు
సైదాపురం	45	రూ.54 లక్షలు
రాపూరు	1	రూ.1.2 లక్షలు
కలువాయి	22	రూ.26.4 లక్షలు
బాలాయపల్లి	03	రూ.3.6 లక్షలు

– ఐదేళ్లగా వెంకటగిరి నియోజకవర్గంలో 1,841 మంది చేనేత కార్మికులకు రూ.22.96 కోట్లు మంజూరు

మరువలేం



నేతన్న నేస్తం పథకం కింద సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సహాయాన్ని జీవితాంతం మరచిపోం. కుటుంబమంతా కష్టపడితేనే పూట గడిచేది. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఐదేళ్లుగా రూ.1.2 లక్షల సాయం అందింది. ఇంట్లోని పాత మగ్గం మొరాయిస్తే దాని స్థానంలో కొత్తది కొనుగోలు చేశాం. దానిమీదే ఇప్పుడు నేను మగ్గం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నా.

– దోపర్తి రమ్య, బంగారుపేట

బాబు పట్టించుకోలా



టీడీపీ హయంలో చంద్రబాబు చేనేత కార్మికులను అసలు పట్టించుకోలేదు. ముడిసరుకుల ధరలు పెరిగినా ప్రభుత్వ ప్రోత్సాహం ఉండేది కాదు. నేసిన చీరలకు కూడా గిట్టుబాటు ధర లభించేది కాదు. జగనన్న సీఎం అయ్యాక మా బతుకులు మెరుగుపడ్డాయి.

– పింజల రాజేశ్వరి, బంగారుపేట

జగనన్నకి రుణపడి ఉంటాం



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు దోహదపడుతోంది. ఈ పథకం కింద ఐదు విడుతలుగా రూ.24 వేలు చొప్పున అందుతోంది. చేనేత పరిశ్రమకు జీవం పోసిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– సత్తాల రమ్య, వెంకటగిరి

వృత్తి నైపుణ్యాలు మెరుగు



జగనన్న ప్రతి ఏటా ఇస్తున్న నేతన్న నేస్తం డబ్బుతో మగ్గానికి అవసరమైన డిజైన్ కార్డు లు, జూకార్డ్ యంత్రం, మో టారు కొనుగోలు చేశాం. వృత్తిపరంగా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకున్నాం. కొత్త డిజైన్లతో చీరలు నేస్తూ ఆదాయాన్ని పెంచుకున్నాం. కుటుంబ పరిస్థితులు మెరుగుపడ్డాయి.

– కే.శ్రీనివాసులు, బంగారుపేట, వెంకటగిరి

చేనేత కార్మికులకు అండ



చేనేత పనులపైనే ఎన్నో ఏళ్లుగా ఆధారపడి జీవిస్తున్నాం. ఇంట్లో మగ్గం పైనే నేత నేస్తున్నాం. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆయన ఇస్తున్న నేతన్న నేస్తం నిధులతో మరింత అభివృద్ధి చెందుతున్నాం.

– చెంజి బాలసుబ్రమణ్యం

ఎస్వీయూ సిగలో మరో మణిహారం

- రూ.8.5 కోట్లతో నైలెట్ సంస్థ మంజూరు
- నిర్వహణ బాధ్యతలు చెన్నై సంస్థకు అప్పగింత
- ఏడాదికి సుమారు వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ
- ఫలించిన ఎంపీ గురుమూర్తి కృషి



తిరుపతి సిటీ: తిరుపతి ఎస్వీయూ సిగలో మరో మణిహారం వచ్చి చేరింది. వర్సిటీకి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (నైలెట్) సంస్థను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి నిర్విరామ కృషి ఫలితంగా నైలెట్ సంస్థ ఎస్వీయూకు దక్కింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రితో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు పలుసార్లు వినతిపత్రాలు ఇవ్వడంతోపాటు ఆ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను మంత్రికి ఆయన వివరించారు.

ఆయన విజ్ఞప్తి మేరకు నైలెట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం అధ్యయనం చేసింది. కమిటీ నివేదిక మేరకు తిరుపతిలో నైలెట్ ఏర్పాటు అవసరమని గ్రహించి కేంద్రం సమ్మతించడంతో రూ.8.5 కోట్ల నిధులు మంజూరు చేసి, ముందడుగు వేసింది. నిర్మాణ బాధ్యతల్ని చెన్నై నైలెట్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. దేశంలో ఎక్కడ లేని విధంగా సెమికండక్టర్స్ తయారీకి తిరుపతి నైలెట్ ప్రత్యేక చొరవ చూపనుంది. అలాగే ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాల శిక్షణ, గుర్తింపు సేవలను అందించడం ద్వారా ఇన్ఫర్మేషన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీ అనుబంధ రంగాల్లో నాణ్యమైన మానవ వనరులను ఉత్పత్తి చేయడం నైలెట్ ప్రధాన లక్ష్యంగా పనిచేయనుంది. నైలెట్ ఏర్పాటుతో తిరుపతికి అత్యాధునిక సాంకేతిక కోర్సులను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని పలువురు ప్రశంసిస్తున్నారు. రాష్ట్రానికి ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్‌కు సంబంధించిన అధునాతన విద్యా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయమని వర్సిటీ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా వెయ్యి మందికి శిక్షణ

వృత్తి విద్యాకోర్సులతోపాటు మారుతున్న టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రధాన నగరాలకు విద్యార్థులు వలసలు వెళుతున్నారు. ఇకపై తిరుపతిలోనే ఆ కోర్సులను చేసే వెసులుబాటు లభించనుంది. అలాగే తైవాన్, జపాన్, చైనా, కొరియా వంటి దేశాలతో ఒప్పందం కుదుర్చుకోవడంతో కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ఈ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసిన మూడేళ్ల నుంచి సంవత్సరానికి సుమారు వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే సౌకర్యం ఉంటుంది.

కేంద్రప్రభుత్వానికి, సీఎం జగనన్నకు ధన్యవాదాలు



ఎంతో కాలంగా ఎస్వీయూలో నైలెట్ సంస్థ ఏర్పాటుకు పలు విధాలుగా ప్రయత్నాలు చేశాం. పలు మార్లు కేంద్ర మంత్రిని కలసి తిరుపతిలో నైలెట్ సంస్థ ఏర్పాటు ఆవశ్యకతను విన్నవించాం. కేంద్ర బృందం సభ్యులు పరిశీలన చేసి ఆవశ్యకతను గుర్తించి, మంజూరు చేయడం శుభపరిణామం. కేంద్ర ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి కేంద్రంగా ఏడాదికి వేల సంఖ్యలో విద్యార్థులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుని దేశ, విదేశాల్లో మంచి ఉపాధి, ఉద్యోగావకాశాలను పొందేందుకు అవకాశం ఉంటుంది. మన విద్యార్థులకు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లే అవసరం ఇక ఇండబోదు.

-ఎం.గురుమూర్తి, ఎంపీ, తిరుపతి

ఎంపీ కృషితోనే ఎస్వీయూకు నైలెట్



తిరుపతి ఎంపీ గురుమూర్తి కృషితో ఎస్వీయూకు నైలెట్ సంస్థ మంజూరైంది. విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగాల మెరుగు కోసం ఎంపీ నిర్విరామంగా కృషి చేసి సంస్థను సాధించడం ప్రశంసనీయం. ఐటీ, వృత్తి విద్య నైపుణ్యం కోసం విద్యార్థులు వ్యయ ప్రయాసలకోర్చి దేశంలో పేరొందిన పట్టణాలకు గతంలో వలస వెళ్లి అవస్థలు పడేవారు. ఇక ఆ అవసరం ఉండదు. ఎస్వీయూనివర్సిటీ క్యాంపస్‌లోనే ఆధునిక శిక్షణను అందించి, విద్యార్థులకు అత్యున్నత స్థాయి ఉద్యోగాలను పొందే అవకాశం ఉంటుంది.

-వీ.శ్రీకాంత్‌రెడ్డి, వీసీ, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

నైలెట్ ఓ వరం



ఎస్వీయూకు నైలెట్ సంస్థ మంజూరు కావడం సంతోషంగా ఉంది. దేశంలోనే ఎస్వీయూకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తిరుపతి ఎంపీ గురుమూర్తి నైలెట్ సంస్థ ఆవశ్యకతను గుర్తించి, కేంద్రంతో పలుసార్లు సంప్రదించి సంస్థను మంజూరు చేయడం శుభపరిణామం. దీంతో ఇక మన రాష్ట్ర, జిల్లా విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు ఈ సంస్థ ఎంతోగానో ఉపయోగపడుతుంది. వర్సిటీ విద్యార్థులకు నైలెట్ సంస్థ ఓ వరంగా చెప్పవచ్చు.

-ఎం.హుస్సేన్, రిజిస్ట్రార్, ఎస్వీయూ, తిరుపతి

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: అరబిందో 104లో ఉద్యోగాల భర్తీ కోసం అర్హులైన వారిని నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 విభాగం జిల్లా మేనేజర్ శేషశయనరెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాకు సంబంధించి 104లో పలు మండలాల్లో డ్రైవర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. డ్రైవర్స్ పోస్టులకు ఎస్ఎస్‌సీతో పాటు హెవీ వెహికల్ లైసెన్స్ ఉండాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్స్‌కు ఏదైనా డిగ్రీతో పాటు కంప్యూటర్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాలను తిరుపతి మున్సిపల్ పార్క్ వద్దనున్న అరబిందో 108, 104 సంస్థ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని..



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రతి మెట్టుకూ పూజ చేస్తున్న దశరథరామిరెడ్డి

నాయుడుపేట టౌన్: సంక్షేమ సారథి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ స్థానిక రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలూరు దశరథరామిరెడ్డి మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ మెట్ల మార్గంలో మోకాళ్లపై నడిచి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ గుడికి వెళ్లే ప్రతి మెట్టుకూ పసుపు, కుంకుమ పెట్టి, కర్పూరం వెలిగించి మొక్కుకున్నారు. సూళ్లూరుపేట నియోజవర్గ అభ్యర్థి సైతం అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరారు.

నిబద్ధతతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని వర్సిటీ వీసీ వి శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నూతన సంస్కరణలపై ఆయన దృష్టి సారించి, మంగళవారం ఆయన చాంబర్‌లో పరిపాలనా సంబంధమైన డిప్యూటీ రిజిస్ట్రార్లు, సహాయ పాలనాధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా నాలుగు విషయాలపై ఆయన ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. సమయపాలన, పారదర్శకత, 24 గంటల్లో ఫైళ్ల క్లియరెన్స్, ఈ– ఫైలింగ్ వంటి అంశాలపై ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంపై వస్తున్న విమర్శలను తిప్పి కొట్టేలా ప్రతి ఉద్యోగి నిబద్ధత పనిచేయాలని, సెక్షన్ ఆఫీసర్లు తమ కింద పనిచేసే ఉద్యోగుల పనితీరుపై తనకు నివేదిక ఇవ్వాలని కోరారు. ఎస్వీయూలో ఈ ఫైలింగ్ విధానం అన్ని విభాగాలకు విస్తరించాలని కోరారు. ప్రతి ఫైల్ 24 గంటల్లో సంబంధించిన అధికారికి చేరాలని, వెంటనే పని పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ఫైనాన్స్ ఆఫీసర్, పలు విభాగాల పరిపాలనా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి



ఉమాపతి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: చేపల వేటకు వెళ్లి కారు ఢీకొన్న ప్రమాదంలో వాటంబేడు కుప్పానికి చెందిన కరింగాలి ఉమాపతి(50) మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు వారం క్రితం సూళ్లూరుపేట మండలంలోని అటకానితిప్ప గ్రామం వద్ద పులికాట్ సరస్సులో చేపల వేటకు వెళ్లాడు. వేట సమయంలో శ్రీహరికోట రోడ్డుమీదకు వచ్చిన ఉమాపతిని ఆ మార్గంలో వెళుతున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఉమాపతిని చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కే.రఘురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కే.ఆర్ముగం, నాయకులు వాసుమొదలియార్, ఏ.దొరరెడ్డి, బీ.వరప్రసాద్ ఉన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రమేష్, సీఐ ప్రసాద్

నాయుడుపేట టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న బెంగళూరుకు చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ గూడూరు డీఎస్పీ జె.రమేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నాయుడుపేట ఎస్ఈబీ కార్యాలయంలో డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ సారథ్యంలో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా ఆర్టీసీ బస్టాండు సమీపంలో నలుగురు వ్యక్తులు రెండు భారీ బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. వారిని నిలిపి ప్రశ్నించగా పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వారిని పట్టుకుని బ్యాగుల్లో పరిశీలించగా అందులో 21 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. దీని విలువ సుమారు రూ.3.15 లక్షలకు పైగా ఉంటుందన్నారు. పట్టుబడిన వారిలో బెంగళూరు ప్రాంతానికి చెందిన సోనుకుమార్, పీ.విక్రమ్, నాగన్నాగౌడ్, రాధేశ్యామ్‌గా గుర్తించామన్నారు. వారు బెంగళూరులోని ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసలై గంజాయిని అరకు ప్రాంతం నుంచి అక్రమంగా తీసుకుని వెళుతూ పట్టుబడ్డారని తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. దాడుల్లో పాల్గొన్న సీఐ ప్రసాద్‌తోపాటు ఎస్ఈబీ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

13 నుంచి డిగ్రీ, పీజీ కళాశాలలకు సెలవులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు ఎస్వీయూ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీసీ ఆదేశాల మేరకు వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలు విధిగా సెలవులను ప్రకటించాలని పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీన కళాశాలలు తిరిగి ప్రారంభం కానున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

12న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ జాబ్ మేళాలో సుమారు 105 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ అర్హత కలిగి 18–35 ఏళ్ల వయస్సు నిరుద్యోగ అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నాలుగు లారీలు ఢీ

– ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

తడ: జాతీయ రహదారి కారూరు పంచాయతీ, కారూరు మిట్ట గ్రామం వద్ద సోమవారం అర్ధరాత్రి ఒకే మార్గంలో వెళుతున్న నాలుగు లారీలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న ఘటనలో తమిళనాడుకు చెందిన ఎస్.క్రిష్ణన్(53) మృతి చెందగా, మరో ఇద్దరు డ్రైవర్లు గాయపడ్డారు. ఎస్ఐ జేపీ.శ్రీనివాసరెడ్డి కథనం.. తమిళనాడు నుంచి నాగ్‌పూర్‌కు ఆయిల్ ట్యాంకర్ వెళ్తోంది. కారూరుమిట్ట వద్ద ముందు వెళుతున్న టిప్పర్‌ని ఢీకొనగా.. టిప్పర్ దానిముందున్న ఐషర్ లారీని ఢీకొట్టింది. ఐషర్ వాహనం దాని ముందున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ క్యాబిన్‌లో నిద్రిస్తున్న సెకండ్ డ్రైవర్ క్రిష్ణన్ లారీలోనే ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో డ్రైవర్‌కి గాయాలయ్యాయి. అలాగే ఐషర్ వాహనంలో హైదరాబాద్‌కు చెందిన గౌస్ అనే డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగించి క్రిష్ణన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని ఆలయం ఎదుట పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ వాటర్ రిసోర్సెస్ చైర్మన్ తదితరులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్‌వాటర్ రిసోర్సెస్ చైర్మన్ ప్రభాత్ భాయ్ సవభాయి పటేల్, జమ్మూ కాశ్మీర్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ తషిరబస్టన్, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, సినీ నటుడు సుధీర్బాబు, దేవినేని అవినాష్, చిత్ర పరిశ్రమ నిర్మాత ఎస్. నాగవంశీ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

దాడిచేసి విష ప్రచారమా?

- వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతల మూకుమ్మడి దాడి
- ఆపై వైఎస్సార్‌సీపీ నాయకులే దాడిచేశారని పచ్చమీడియా ద్వారా విషప్రచారం
- విలేకరుల సమావేశంలో బాధితుల ఆవేదన



టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన వాహనం

దక్కిలి: పథకం ప్రకారం టీడీపీ నేతలు తమపై దాడిచేసి తామే వారిపై దాడిచేసినట్లు టీడీపీ అనుకూల మీడియా ద్వారా విషప్రచారం చేస్తున్నారని డక్కిలి మండలం, దేవునివెల్లంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కోళ్లూరు బాలకృష్ణ, స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డక్కిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచ్ చింతపూడి సుజాత ఆధ్వర్యంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈనెల 7వ తేదీ రాత్రి దేవునివెల్లంపల్లి గ్రామానికి చెందిన ఏలేశ్వరం శంకరయ్య చేత టీడీపీ నాయకులు మద్యం తాపించి తమపై దాడికి ఉసిగొల్పారని ఆరోపించారు. మద్యం మత్తులో ఉన్న శంకరయ్యతో పాటు గ్రామానికి చెందిన ఏలేశ్వరం గౌరీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రనాయుడు, సుజాత, శ్రీహరి, ప్రమీలా, మనోహర్, రమణయ్య, వేముల గోపాల్, పద్మజ, ఈశ్వరయ్య, వేముల గౌరీ, వేముల విద్యార్థి, మురళీ, ఈశ్వర మ్మ, ప్రసాద్, వజ్రమ్మ, చెంచమ్మలతో పాటు మరికొంత మంది టీడీపీ నాయుకులు మూకమ్మడిగా తమ ఇళ్ల వద్దకు వచ్చి దాడికి తెగబడ్డారని ఆరోపించారు. మారణాయుధాలతో తమపై దాడి చేశారని తెలిపారు. భయాందోళనకు గురైన తాము ఊరు విడిచి వెళ్తుండగా మార్గ మధ్యంలో వాహనాన్ని అడ్డగించి మరీ దాడికి పూనుకున్నారని తెలిపారు. అయితే తామే వారిపై దాడి చేసినట్లు డక్కిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు.

ప్రాణహాని ఉంది..రక్షణ కల్పించండి

టీడీపీ నేతల నుంచి తమకు ప్రాణహాని ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోకి వస్తే చంపేస్తామని టీడీపీ నేత లు బెదిరిస్తున్నారని వాపోయారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి ఇక్కడ సర్పంచ్‌గా గెలుపొందారని, దీంతో మాజీ జెడ్పీటీసీ రామచంద్రనాయుడు తమపై కక్ష పెంచుకుని దాడులకు తెగబడుతున్నారని వారు ఆరోపించారు.

అక్రమణలు బయటపెట్టినందుకే

డక్కిలి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రనాయుడు తమపై తరచూ దాడులకు పాల్పడుతున్నాడని వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలో స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయానికి సంబంధించిన భూములను టీడీపీ నేతలు ఆక్రమించారని ఆరోపించారు. ఈ విషయంపై తాము గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

ఇరువురిపై కేసు నమోదు

దేవునివెల్లంపల్లి గ్రామంలో ఈ నెల 7వ తేదీ జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరుపార్టీల నేతలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపడతామని పేర్కొన్నారు.